




గజ్వేల్‌లో ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది



**పోలింగ్‌కు సర్వం సిద్ధం**

- నియోజకవర్గంలో 202 సమస్యాత్మక కేంద్రాలు
- తొమ్మిది మండలాల్లోని గ్రామాలకు 30 రూట్లు
- అందుబాటులో అదనంగా 25శాతం ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

# గజ్వేల్‌లో 321 పోలింగ్ కేంద్రాలు





ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బందిల

గజ్వేల్, నవంబర్ 29: గురువారం జరగనున్న శాసనసభ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, పోలీస్, ఇతర సిబ్బంది గజ్వేల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో విధుల్లో చేరారు. నియోజకవర్గం లో 321 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 1284 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. తొమ్మిది మండలాల్లోని 174 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలను 30 రూట్లుగా విభజించారు. అందులో 202 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించగా ఆ కేంద్రా ల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా రికార్డు చేయనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు తనిఖీలు చేస్తారు. 321 పోలింగ్ కేంద్రాల్లో 963ఈవీఎంలను వినియోగిస్తున్నారు. అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా 25శాతం ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. ఇందుకోసం 80మంది సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ తెలిపారు. మైక్రో అబ్జర్వర్లు ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తారు. పోలింగ్ కేంద్రంలో ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు సెల్‌ఫోన్‌లను అనుమతించడం లేదని ఆర్‌వో తెలిపారు.

**పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది**

గజ్వేల్ నియోజకవర్గంలోని 321 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రత్యేక బస్సుల్లో పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. ఆర్‌వో కార్యాలయం వద్దకు చేరుకున్న సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. అధికారులు అందజేసిన సామగ్రిని అక్కడే సరిచేసుకున్నారు. ప్రతి సామగ్రిని పరీక్షించుకున్న తర్వాతనే ఈవీఎంలను ఆర్‌వో కేంద్రంలోని బాధ్యుల ద్వారా తీసుకొని బయలుదేరారు. 30 రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో వాటిలోనే పోలింగ్ కేంద్రాలను బందోబస్తు మధ్య వెళ్లారు. సాయంత్రం సమయానికి పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది అక్కడ పోలింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా గ్రామ కార్యదర్శుల ద్వారా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన సిబ్బందికి ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం సౌకర్యాలను సమకుర్చారు. భోజన విరామం తర్వాత ఆర్‌వో కార్యాలయం నుంచి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు**

గజ్వేల్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్‌లతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అదేవిధంగా రూట్ మార్గాల్లో పర్యవేక్షణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. 30 రూట్ మొబైల్స్, క్రిటికల్ కేంద్రాలు 94, సాధారణ 168, క్యూర్టీ టీంలు 8, స్ట్రైకింగ్ ఫోర్స్ టీంలు 2, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఒక టీంలను ఏర్పాటు చేయగా ఇందులో అధికారులు, సిబ్బంది 492 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ అధికారులకు డీసీపీ అడ్మిన్ అందు శ్రీనివాస్‌రావు, ఏసీపీ రమేశ్ దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

**ఓటు హక్కును వినియోగించుకోవాలి**



ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటు వేస్తేనే పోలింగ్ నమోదు శాతం పెరుగుతుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో సాధ్యమైనంతగా పోలింగ్ శాతాన్ని పెంచేలా చూడాలి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తున్నామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశాం.

*- బన్సీలాల్, ఆర్‌వో, గజ్వేల్*

# దీక్షా దివస్ చారిత్రాత్మకం

- నవంబర్ 29 కేసీఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర సాకారం
- దీక్షా దివస్‌లో భాగంగా రక్తదాన శిబిరం
- రంగధాంపల్లి వద్ద అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 29 : 'నవంబర్ 29 దీక్షా దివస్ అనేది ఒక చారిత్రాత్మక దినం.. కేసీఆర్ ఒక ఉద్యమకారుడుగా కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నివాదంతో దీక్షను చేపట్టిన రోజు' అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం దీక్షా దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని రంగధాంపల్లి అమరవీరుల స్తూపంవద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి నివాసంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ దీక్షకు వెళ్లేటప్పుడు నా శవయాత్ర లేదా తెలంగాణ జైత్రయాత్రని ఆమరణ దీక్షకు కూర్చున్న రోజు నవంబర్ 29 అన్నారు. ఈ దీక్షకు సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వేదికైందన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష యావత్ తెలంగాణ ప్రజలను కదిలించిందన్నారు. తెలంగాణను సాధించిందన్నారు. నవంబర్ 29 చరిత్రను మలుపుతిప్పిన రోజు అన్నారు. కరీంగనర్ నుంచి సిద్దిపేటలోని దీక్ష స్థలికి కేసీఆర్ వస్తుంటే అనాటి సీమాంధ్ర పాలకులు అలుగునూరు వద్ద పోలీసులు మోహరించి అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలిం చారన్నారు. అయినా కేసీఆర్ దీక్షను కొనసాగించార న్నారు. ఖమ్మం దవాఖానకు తీసుకెళ్లినా కేసీఆర్ తన దీక్షను కొనసాగించారని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుంటే అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. తన శరీరం సహకరించకున్నా దీక్షను కొనసాగించారన్నారు. కేసీఆర్ దీక్ష ఫలితంగా అనాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటన చేశారన్నారు. కేసీఆర్ దీక్ష చేయకపోతే ఈ రోజు తెలంగాణ వచ్చేది కాదన్నారు. మనం స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే వాళ్లం కాదన్నారు. జయశంకర్ చెప్పిన ఉద్యమ ట్యాగ్‌లైన్ నీళ్లు, నిధులు, నియమాకాల కల నిజమయ్యేది కాదన్నారు. ఈ దీక్ష చరిత్ర పుటల్లో నిలిచిపోతుందన్నారు. దీక్షకు వేదికైన రంగధాంపల్లి వద్ద ఆచార్య జయశంకర్ చేతుల మీదుగా అమరవీరుల స్తూపం నిర్మించుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



చింతమడకలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్వేత

# నేడు చింతమడకకు సీఎం కేసీఆర్



- 13వ పోలింగ్ కేంద్రంలో ఓటేయనున్న సీఎం దంపతులు
- ఏర్పాట్లను పరిశీలించిన సీపీ శ్వేత

సిద్దిపేట రూరల్, నవంబర్ 29 : మండలంలోని చింతమడక గ్రామంలోని 13వ పోలింగ్ కేంద్రంలో సీఎం కేసీఆర్ దంపతులు గురువారం ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం సీపీ శ్వేత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, పోలింగ్ కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుపై తగిన ఆదేశాలు ఇచ్చారు. ఓటు జాబితాలో సీఎం కేసీఆర్ సీరియల్ నం :158 కాగా, ఓటరు కార్డు సంఖ్య: ఎస్‌ఏజీ 0399691, సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభారాణి సీరియల్ నం :159 ఓటరుకార్డు సంఖ్య :ఎస్‌ఏజీ0761676, ఇరువురి ఇంటినెం :3-37 సీఎం కేసీఆర్ రానుండడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. చింతమడకలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. కాగా సిద్దిపేటలోని భారత్ నగర్ అంబిటస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో హరీశ్‌రావు దంపతులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.